సాక్షి అనకాపల్లి

మంగళవారం । 11 । జూలై । 2023



ప్రతి అర్జీకి పరిష్కారం

కలెక్టరేట్ స్పందనకు 310 అర్జీలు వచ్చాయి. జేసీ జాహ్నవి, డీఆర్వో వెంకటరమణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 8లో



కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ

కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీలు మళ్లీ ప్రారంభమయ్యాయి. వైద్యులు 18 ఏళ్ల యువకుడికి శస్త్రచికిత్స చేశారు. 8లో



నాట్య మయూరి

చిన్నారి తాన్విశ్రీ తన నాట్య ప్రతిభతో ఆకట్టుకుంటోంది. ఆలిండియా డాన్స్ ఫెస్టివల్‌లో ఆమె పాల్గొంది. 8లో

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నక్కపల్లి: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో గత నెల నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక బాలికోన్నత పాఠశాల చిన్నారులు గొర్ల నిత్య(10వ తరగతి), నాగ స్వాతిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ తెలిపారు. ఇప్పటికే వీరిని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మలు ప్రత్యేకంగా అభినందించినట్టు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 14న విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో రాష్ట్ర స్థాయి క్విజ్‌పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు పర్యవేక్షకులుగా నాగప్రవీణ్ వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 100 మంది ఎంపిక



విద్యార్థినితో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్‌వర్మ

అనకాపల్లిటౌన్ : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. బహుళజాతి కంపెనీలైన అమెజాన్, టెక్ మహీంద్రా, హెచ్‌జీఎస్ కంపెనీల ప్రతినిధులు 200 మంది విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ చెప్పారు.

ఈ పరీక్షలో 100 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు శ్రీకాంత్‌వర్మ, అధ్యాపకులు ఎస్.ఆర్.జమీర్, కె.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కవయిత్రి స్వాతికి కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం



కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న స్వాతి

రావికమతం: కొత్తకోటకు చెందిన ప్రముఖ కవయిత్రి స్వాతి సోమవారం హైదరాబాద్‌లో కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం అందుకున్నారు. గతంలో ఆమె రచనలు అనేక సందర్భాల్లో ప్రశంసలు అందుకున్నాయి. తాజాగా మౌనమేఘాలు అనే కవితకు కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్వాతి ప్రఖ్యాత కవి కొలకలూరి ఇనాక్ సహా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆమె భర్త కృష్ణమోహన్ కొత్తకోట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

పెల్లుబికిన ఆగ్రహం

- పవన్ వ్యాఖ్యలపై నిరసన **వెల్లువ**
- తప్పుడు ఆరోపణలతో దిగజారుడు రాజకీయాలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామ, వార్డు వలంటీర్లు
- పవన్ బహిరంగ క్షమాపణలు **చెప్పాలని** డిమాండ్
- లేదంటే ఆందోళన ఉధృతం **చేస్తామని** హెచ్చరికలు
- వాడవాడలా రోడ్డెక్కి నిరసన **వ్యక్తం** చేసిన వలంటీర్లు
- స్వచ్ఛందంగా సంపూర్ణ మద్దతు పలికిన ప్రజలు



అనకాపల్లి నెహ్రూచౌక్‌లో మానహారం నిర్వహిస్తున్న వలంటీర్లు



యలమంచిలిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద వలంటీర్ల నిరసన



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

సాక్షి, అనకాపల్లి: ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరిస్తూ.. ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారుల ఇంటికే చేరుస్తూ.. ప్రజల హృదిలో వలంటీర్లు సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయకముందే పింఛను డబ్బులు చేతికందిస్తూ.. అవ్వా తాతల మోముల్లో చిరునవ్వుగా మారిన వలంటీరు వ్యవస్థపై పవన్‌కల్యాణ్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లు ఆడవాళ్ల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారంటూ పవన్ కల్యాణ్ చేసిన నీచమైన దిగజారుడు మాటలపై వలంటీర్లే కాదు.. ప్రజలంతా ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. కోవిడ్ సమయంలో కుటుంబ సభ్యులే చూడని రోజుల్లోనూ మేమున్నామంటూ ఇంటింటికీ వెళ్లి సాయమందించిన వలంటీర్ల గురించి అసభ్యకరంగా మాట్లాడితే సహించేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల వలంటీర్లు నిరసన ప్రదర్శనలు చేశారు. హ్యూమన్ ట్రాఫికింగ్‌లో వలంటీర్ల హస్తం ఉందని నిఘా సంస్థ చెప్పినట్లుగా మాట్లాడిన పవన్ కల్యాణ్‌కు దమ్ముంటే.. ఆ నిఘా సంస్థ డేటాకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. యావత్ దేశం కూడా ఇక్కడ వలంటీర్ వ్యవస్థని కొనియాడుతుంటే.. మహిళల్ని కించపరిచే విధంగా పవన్ మాట్లాడటం ఇకనైనా మానుకోవాలనీ.. తక్షణమే తమకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలనీ.. లేదంటే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కరోనా సమయంలో తామెంతో సేవ చేశామనీ.. ఆ సమయంలో ప్రజల కోసం మీరేం చేశారని పవన్‌ని ప్రశ్నించారు.

- తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఒంటరి మహిళలు కనిపించకపోవడానికి వలంటీర్లే కారణమని.. వారి వ్యక్తిగత సమాచారాన్ని రౌడీ మూకలకు చేరవేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ **చేస్తూ అసోసి**యేషన్ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిర**సన తెలిపారు**. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, ఎస్పీ మురళీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు.
- అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద పట్టణ, రూరల్ పరిధిలోని వలంటీర్లు మానవహారం నిర్వహించి.. నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లు నిరసన వ్యక్తం చేసి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.
- చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో వలంటీర్లు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు.
- పాయకరావుపేట మండలం శ్రీరాంపురంలో పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు.
- యలమంచిలిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద వలంటీర్లు నిరసన తెలిపారు.

సేవామూర్తులపై అభాండాలా..

- పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: సేవామూర్తులైన వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన నిరాధార ఆరోపణలను వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఆదర్శవంతమైన వలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. గౌరవ వేతనం తీసుకుని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే కాకుండా ప్రతి నెల 1వ తేదీన తెల్లవారకముందే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల తలుపు తట్టి పింఛన్ అందజేయడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజలు కోవిడ్ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబ సభ్యులనే నిరాదరిస్తున్న సమయంలో కోవిడ్ కట్టడిలో వలంటీర్లు ఆదర్శవంతమైన సేవలందించారన్నారు. చంద్రబాబు, అతని దత్తపుత్రుడు పవన్ అధికారం కోసం కుయుక్తులు పన్నుతున్నారని, అయితే రాష్ట్ర ప్రజలు మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడం ఖాయమన్నారు. మహిళా వలంటీర్ల మనోభావాలను నొప్పించే విధంగా మాట్లాడడం దారుణమని, త్వరలో మహిళలే పవన్‌కు, చంద్రబాబుకు బుద్ధి చెబుతారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు పవన్, చంద్రబాబులకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ మునూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండిపడ్డ వలంటీర్లు

తుమ్మపాల: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్లు మండిపడ్డారు. నిరాధారమైన ఆరోపణలకు తీవ్ర అభ్యంతరం చెప్పారు. క్షమాపణ చెప్పకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జిల్లా వలంటీర్ల సంఘం నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.మదన్, యూనియన్ సభ్యులు రొంగలి చెల్లునాయుడు, బి.రాము, చేపల రాజు, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద వలంటీర్ల సంఘం నేతల నిరసన

పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలి



రాజకీయాలంటే స్క్రిప్టు రాసుకుని సినిమాలు చేయడమనుకుంటున్నారేమో.. ప్రజా సేవకు అంకితమైన వారిపైన అభాండాలు వేస్తే ఏమవుతుందో చూపిస్తాం. ఒకరితో పొత్తు, మరొకరికి మద్దతు పలికే నీచ రాజకీయాలు మాకు చేతకాదు. పవన్ వ్యాఖ్యలపై మేం చేసిన ఫిర్యాదుల మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలి. -కె.మదన్, వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

బహిరంగ క్షమాపణ చెప్పాలి



జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా సేవ చేసే మాపై చేసిన వ్యాఖ్యలను పవన్ కల్యాణ్ వెనక్కుతీసుకోవాలి. ఇంటింటికీ వెళ్లి ఆడవారిని మేము ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆయన మాట్లాడటం తగదు. వలంటీర్లందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– చేపల రాజు, కొత్త రేవుపోలవరం గ్రామం, ఎస్.రాయవరం మండలం

నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం



సేవ చేసేవారిని అభినందించండి.. లేదంటే రాజకీయాల నుంచి తప్పుకుని సినిమాలు తీసుకోండి. పవన్ కల్యాణ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. రాజకీయాలు చేతకాకపోతే పోయి సినిమాలు తీసుకోండి. అంతేకాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం.

– బి.రాము, వలంటీర్, వాకపాడు పంచాయతీ, ఎస్.రాయవరం మండలం

భారీ వర్షం.. రైతుల హర్షం



మాకవరపాలెంలో భారీగా కురుస్తున్న వర్షం



నాతవరం మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై వాన నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

మాకవరపాలెం/బుచ్చెయ్యపేట/మాడుగుల/నాతవరం : భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో భారీగా కురిసిన వర్షాలతో రైతులు నారుమడులు, దుక్కు పనులను ప్రారంభించారు. మరలా మూడు రోజులుగా అధికంగా కాస్తున్న ఎండలకు ఇటు ప్రజలు ఉక్కపోతకు గురికాగా, రైతులకు వ్యవసాయ పనులు ముమ్మరం చేసే అవకాశం లేకుండా పోయింది.

- మాకవరపాలెంలో సోమవారం ఉదయం నుంచీ భారీ ఎండలు ఇబ్బంది పెట్టినా, సాయంత్రం వాతావరణం చల్లబడి గంటకు పైగా వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉపశమనం లభించింది. మరోవైపు వ్యవసాయ పనులకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- బుచ్చెయ్యపేటలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేసవిని తలపించేలా ఎండ కాసింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశం మబ్బులుపట్టి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 8 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- మాడుగులలో సోమవారం సాయంకాలం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే ఇటీవల వేసిన వరి నారుమడులుకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- నాతవరం మండలంలో కూడా భారీ వర్షం కురిసింది. రైతులకు ఆనందాన్ని కలిగించింది. ఇప్పటికే రైతులంతా వరినారు వేసి, నీటి కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలోనే వరిసాగు విస్తీర్ణంలో మండలం ప్రథమ స్థానంలో ఉంటుంది. తాజా వర్షంతో ఖరీఫ్ నారుమడుల ఎదుగుదలకు ఇబ్బంది లేదని రైతులు చెప్తున్నారు. భారీ వర్షంతో నీరంతా రోడ్లపైకి చేరి, వాహనాల రాకపోకలకు కాస్త ఇబ్బంది కలిగించింది.

రోడ్డు విస్తరణకు శ్రీకారం



విస్తరించనున్న పెరుగుబజార్ రహదారి



గాంధీబొమ్మ జంక్షన్ వద్ద జేసీబీతో భవనాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- అనకాపల్లిలో నెల రోజుల్లో రోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణం
- భవన యజమానులు, వ్యాపారుల సహకారంతో నిర్మాణాల తొలగింపు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పట్టణంలో పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకూ ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పడనుంది. గత 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు సోమవారం మొదలయ్యాయి. భవన యజమానుల అంగీకారంతో జీవీఎంసీ అధికారులు దగ్గరుండి మరీ విస్తరణకు అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపు పనుల్ని చేపట్టారు. భవన యజమానులతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమావేశాలు నిర్వహించి, వారిని ఒప్పించడంతో విస్తరణ పనులకు ఆటంకాల్లేకుండా, ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

పరిహారం చెల్లింపు

పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్‌వరకూ సుమారుగా కిలోమీటర్ ఉంటుంది. అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రధానమైన మార్గం ఇదే. రహదారిలో 124 భవనాలు ఉండగా 15 ఖాళీ స్థలాలున్నాయి. మొత్తం 139 భవనాలకు ప్రభుత్వం రహదారి విస్తరణ నోటీసులిచ్చింది. ఇందులో భవనాలు కోల్పోయిన వ్యక్తులకు రూ.కోటీ 54 లక్షల నిధులు సిద్ధం చేసింది. ఇప్పటికే రూ.కోటి చెల్లించింది. కొందరికి చెల్లించాల్సిన రూ.54 లక్షలు ప్రభుత్వం వద్దే ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో ఈ నగదు మిగిలిన భవన యజమానులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలి రోజు 10 భవనాల తొలగింపు

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలిరోజు 10 నిర్మాణాలను తొలగించారు. కొంత మంది వ్యాపారస్తులు తమ భవనాలు పూర్తి స్థాయిలో పాడైపోకుండా, విస్తరణకు అవసరమైన మేర వారే సొంతంగా నిర్మాణాలను తొలగిస్తున్నారు. జీవీఎంసీ యంత్రాంగం ముందుగా ఖాళీస్థలాలు, శిథిలావస్థకు చేరుకున్న భవనాల వద్ద విస్తరణకు వీలుగా తొలగింపులు చేపడుతున్నారు. భవన యజమానులు స్వచ్ఛందంగా సహకరించడంతో పనులు మరింత వేగవంతమవుతున్నాయి. జీవీఎంసీ టీపీవో ఎంపీ జనార్దన్, పట్టణ సీఐ దాడి మోహనరావు, విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ పేరపు రాంబాబు, అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగరావు, రెవెన్యూశాఖ, జీవీఎంసీ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలకు విముక్తి



పెరుగుబజార్–గాంధీబొమ్మ రహదారిలో చిన్నకారు వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాలి. ఈ రోడ్డులో చోరీలు కూడా ఎక్కువగా జరిగేవి. పండగ సమయాల్లో రహదారిలో వెళ్లాలంటే నరకయాతన తప్పదు. చాలా ప్రభుత్వాల్లో ఈ రోడ్డును విస్తరిస్తామని హామీలు గుప్పించారు. జగనన్న ప్రభుత్వంలో రోడ్డు విస్తరణకు మార్గం సుగమమై, ట్రాఫిక్ ఇక్కట్లు తీరనున్నాయి.

– పి.కల్యాణ్, అనకాపల్లి

ఎట్టకేలకు చర్యలు



15 సంవత్సరాలుగా రహదారి విస్తరణ పనులు చేపడతామని అధికారులు చెప్పడమే తప్ప, ఆచరణకు మాత్రం నోచుకోలేదు. కొత్త జిల్లాగా ఏర్పడ్డాక ట్రాఫిక్ సమస్యలు పెరిగాయి. వీటి పరిష్కారానికి భవన యజమానులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా చర్యలు తీసుకోవడం బాగుంది. త్వరితగతిన రహదారి పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– మేడిశెట్టి గణేష్, అనకాపల్లి

భవన యజమానుల సహకారంతోనే..



ఈ రహదారిలో నిత్యం రద్దీ ఉంటుంది. భవన యజమానుల సహకారం వల్లే పనులు ప్రారంభించాం. కొంత మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. నెల రోజుల్లో అంచెలంచెలుగా రహదారిని విస్తరిస్తూ, రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తాం.

– ఎంపీ జనార్దన్, టీపీవో, జీవీఎంసీ, అనకాపల్లి జోన్

మళ్లీ పెద్ద పులి కలకలం

- దేవరాపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దులో సంచరిస్తున్నట్టు ఆనవాళ్లు
- పాదముద్రలను సేకరించి పెద్ద పులివేనని నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- పులి జాడ గుర్తింపునకు ట్రాప్ కెమెరాల ఏర్పాటు



పులి సంచార ప్రాంతంలో ట్రాప్ కెమెరాను అమర్చుతున్న అటవీశాఖ అధికారులు



అటవీశాఖ అధికారులు సేకరించిన పులి పాదముద్రలు

దేవరాపల్లి: జిల్లాలో మళ్లీ పెద్ద పులి కలకలం మొదలైంది. మండలంలోని ఇసుక గెడ్డ మినీ రిజర్వాయర్‌కు సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు గిరిజనులు చెప్పడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యూనియల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీకి చెందిన నిపుణుల బృందం (టైగర్ ఎక్స్‌పర్ట్) పులి సంచరిస్తున్న ప్రాంతంలో పాద ముద్రలను సోమవారం పరిశీలించింది. అనంతరం పెద్ద పులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారించారు. దేవరాపల్లి–అనంతగిరి మండలాల సరిహద్దులో పెద్ద పులి సంచరిస్తున్న అటవీ ప్రాంతంలో పులి జాడ కోసం ట్రాప్ కెమెరాలను అమర్చినట్లు జీనబాడు రేంజర్ వి.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేవళ్లపాలెం, జీనబాడు అటవీ ప్రాంతం నుంచి ఇసుకగెడ్డ మినీ రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న బుచ్చెంపాలెం సమీపంలో పెద్ద పులి సంచరించిన ప్రాంతంలో అడుగు జాడలను పరిశీలించిన అనంతరం నిర్ధారించామన్నారు. పెద్ద పులి సంచరిస్తున్న దేవరాపల్లి మండలం బుచ్చెంపాలెంతోపాటు వాలాబు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని గిరిజనులకు ఆయన సూచించారు. అటవీశాఖ అధికారులు పెద్ద పులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారించడంతో దేవరాపల్లి, అనంతగిరి మండలాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విశాఖ: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిరుద్యోగ యువతకు భారత ప్రభుత్వరంగ సంస్థ సీఐపీఈటీ (విజయవాడ) ఉపాధి కల్పనతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ సోమవారం తెలిపారు. ఇప్పటికే 30 మంది విజయవాడలో శిక్షణ పొందుతున్నారని, మరో 30 మందికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్స్ ప్రభావిత గ్రామాల నివాసులైన నిరుద్యోగ యువతకు విజయవాడలో 6 నెలలపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నైలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీని సోమవారం వైద్యులు విజయ వంతంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో కార్డియోథోరసిక్ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కె.మణిత ఆధ్వర్యంలో రెండున్నర గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్సను విజయ వంతంగా పూర్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా వంగర గ్రామానికి చెందిన డి.ధనుంజయ(18) గుండె జబ్బుతో ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఇతర ఆరోగ్య సమస్యలూ ఉన్నాయి. దీంతో గుండెలో రంధ్రం ఉన్నట్టు కేజీహెచ్ కార్డియాలజీ వైద్యులు గుర్తించారు. ఆరోగ్యశ్రీలో తక్షణమే ఓపెన్ హార్ట్ సర్జరీ పూర్తి చేశారు. రోగి ఆరోగ్యంగా ఉన్నాడని, ఐసీయూకి తరలించామని కేజీహెచ్ కార్డియోథోరసిక్ విభాగాధిపతి డాక్టర్ కె.మణిత చెప్పారు. రోగి ధనుంజయను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పరామర్శించారు.

అందుబాటులో టెంపరేచర్ కంట్రోల్ మెషీన్

ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీకి అవసరమైన పరికరం ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో కొద్ది నెలలుగా గుండె శస్త్ర చికిత్సలు జరగడం లేదు. కలెక్టర్ మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చొరవ తీసుకొని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె రూ.40 లక్షల విలువ చేసే టెంపరేచర్ కంట్రోల్ మెషీన్‌ను మంజూరు చేశారు. ఈ మిషన్‌ను ఆస్పత్రిలో అమర్చిన తరువాత తొలిసారిగా సోమవారం ధనుంజయకు ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించారు.

ప్రతి అర్జీకి గడువులోగా పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి
- కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం (స్పందన)కు 310 అర్జీలు

తుమ్మపాల: ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం చేసే ప్రతి అర్జీని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. ఈ వారం అత్యధికంగా 310 అర్జీలు నమోదయ్యాయి. వీటిని ఆమెతోపాటు డీఆర్వో పి.వెంకటరమణ, డీఆర్డీవో పీడీ లక్ష్మీపతి, డీఎల్‌డీవో మంజులావాణి ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. అర్జీదారులను నేరుగా కలిసి క్లుప్తంగా వివరాలను సేకరించి వారు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యల వివరాలను స్పష్టంగా అర్జీదారుడికి అర్థమయ్యేలా లిఖితపూర్వక సమాధానం అందించాలన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత జిల్లా అధికారులను తక్షణమే పిలిచి వివరాలు సేకరించారు. సమస్యలను పరిష్కారం చేసి తమకు నివేదిక రూపంలో తెలియజేయాలన్నారు. స్పందన అర్జీల నమోదు కేంద్రం వద్ద వేచిఉన్న వృద్ధులు, దివ్యాంగుల వద్దకు డీఆర్వో వచ్చి వారి అర్జీలు స్వీకరించారు.



దివ్యాంగుడి సమస్య వింటున్న ఎస్పీ మురళీకృష్ణ

కలెక్టరేట్ వద్ద నిరసనలు.. ఫిర్యాదులు

- పూర్వకాలంగా సాగులో ఉంటున్న భూమిని రీసర్వేలో తమకు తెలియకుండా ఇతరుల పేరున ఇచ్చిన పట్టాలను రద్దు చేసి తమకు భూహక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రోలుగుంట మండలం రత్నంపేట పంచాయతీకి చెందిన గిరిజనులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం న్యాయం చేయాలంటూ స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- గృహ నిర్మాణ శాఖకు సంబంధించి మునగపాకలో 80 టన్నుల ఇనుము, 1300 బస్తాల సిమెంట్ దోచుకున్న అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నాగులాపల్లికి చెందిన దొడ్డి శ్రీనివాసరావు స్పందనలో ఫిర్యాదు చేశాడు. నిందితులను గుర్తించినప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు.
- అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా ఎక్కువ వేతనం ఇవ్వాలంటూ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలని, తమకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సోమవారం నుంచి 36 గంటల పాటు ధర్నా చేయనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు.
- స్పందన కార్యక్రమంలో భాగంగా పలు సమస్యలపై చేసిన నిరసనలను అదుపు చేసేందుకు రూరల్ ఎస్సై నరసింహారావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులకు మజ్జిగ పంపిణీ చేశారు.



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న బంగారమ్మపాలెం గ్రామస్తులు

ఎస్పీ స్పందనకు 52 అర్జీలు

అనకాపల్లి టౌన్: తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 52 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం వేదికగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అర్జీదారులు స్వయంగా ఎస్పీని కలిసి అర్జీలు అందజేస్తూ, వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆస్తి తగాదాలు, చీటింగ్‌పై అర్జీలు ఎక్కువగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషినల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్.బి. ఇన్‌స్పెక్టరు చంద్రశేఖర్, ఎస్‌ఐ వెంకన్న పాల్గొన్నారు.



దివ్యాంగుల వద్ద వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో

ఎస్ఏవోబీ సమస్య పరిష్కరించాలని వినతి

ఎస్.రాయవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో ఏళ్ల నాటి కాలంగా ఎస్ఏవోబీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని గ్రామస్తులు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జేసీ జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నిర్వాసితులుగా ఉన్న తమకు పూర్తి స్థాయిలో ఏ ప్యాకేజీ అందివ్వలేదన్నారు. గ్రామ సమీపంలో 2004 నుంచి నేవల్ బేస్ పనులు ఆటంకం లేకుండా సాగుతున్నాయని, బాధితుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్యాకేజీ అందివ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎంపీటీసీ మైలపల్లి రాజారావు, గ్రామస్తులు కారే సింహాచలం, తదితరులు ఉన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

కశింకోట: ఉగ్గినపాలెం వద్ద ఐఒసీ బంకు వద్ద మూడు రోజుల క్రితం మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. అనకాపల్లిలోని పూడిమడల ప్రాంతానికి చెందిన కంచర్ల శివకృష్ణ (55)గా మృతుడి బంధువుల ద్వారా గుర్తించామన్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఖాళీ సీసాలు ఏరుకొని విక్రయించి జీవనం సాగిస్తున్న శివకృష్ణ ఈ నెల 7న మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం చేసి బంధువులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు. మద్యం అలవాటు ఉండడంతో ఎండ తీవ్రత వల్ల గాని అపస్మారక స్థితికి చేరి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు.

స్టాండింగ్ కమిటీకి 19 నామినేషన్లు

దాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఈ నెల 19న జరగనున్నాయి. ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో అర్హులైన కార్పొరేటర్లు నామినేషన్లు వేసుకోవాలని సెక్రటరీ పి.నల్లనయ్య సూచించారు. ప్రస్తుత స్టాండింగ్ కమిటీ ఏడాది కాలం ఈ నెల 26తో ముగియనున్న నేపథ్యంలో నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటి వరకు 19 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 10 మంది పేర్లను అధికార వైఎస్సార్ సీపీ ఇప్పటికే ఖరారు చేసింది. వైఎస్సార్ సీపీ తరఫున 10 మంది నామినేషన్లు వేయగా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నుంచి 9 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు అదనపు కమిషనర్ తెలిపారు. గతేడాది మొత్తం 10 మంది కూడా వైఎస్సార్‌సీపీ నుంచే ఎన్నికయ్యారు. ఈ నెల 11వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు అందిన నామినేషన్ల జాబితా ప్రచురిస్తారు. 12న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు పరిశీలిస్తారు. అనంతరం అర్హత గల ప్రామాణిక నామినేషన్ల జాబితా ప్రచురిస్తారు. 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు.

జగనన్న సురక్షతో నిరుపేదలకు మేలు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుందని డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం మాడుగుల మండలం సత్యవరంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే న్యాయం చేయడానికే జగనన్న ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టారన్నారు. గతంలో కుల ధ్రువీకరణతోపాటు ఇతర పత్రాలు పొందాలంటే మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, గ్రామంలోనే అందిస్తున్నామన్నారు. అనంతరం 850 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మండల సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఓఎస్‌డీ ఎం. పోలినాయుడు, ఎంపీటీసీ తలారి అప్పారావు, సత్యవరం, జంపెన సర్పంచ్‌లు, జెర్రిపోతుల నాగమణి, ఎన్. గురువునాయుడు, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివాడ వెంకటరమణ, ఇందుకూరి నాగరాజు, కాళ్లరాజు, జాజుల ఈశ్వరరావు, జనపరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.



ధ్రువీకరణ అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ఒక్క రోజులోనే కుల ధ్రువీకరణ



గతంలో తూర్పు కాపు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలంటే మండల కేంద్రం చుట్టూ కనీసం పది రోజులు తిరగాల్సి వచ్చేది. రూ. వెయ్యి నుంచి రూ.1500 వరకు ఖర్చయ్యేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్‌కు చెబితే ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ తీసుకెళ్లి ఒక్క రోజులోనే ఉచితంగా కుల ధ్రువీకరణపత్రం ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. మాలాంటి నిరుపేదలకు పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– మజ్జి దేవానంద్, చుక్కపల్లి చీడికాడ మండలం

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

నర్సీపట్నం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ) బోధనకుగాను అతిథి అధ్యాపకుని (గెస్ట్ లెక్చరర్)పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు తెలిపారు. ఎమ్మెస్సీలో 55 శాతం మార్కులతో పాసై, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 15న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

జిల్లాలో 210 ఫిష్ షాపులు

పాయకరావుపేట : అనకాపల్లి జిల్లాలో ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా 210 ఫిష్ షాపులు ఏర్పాటు చేస్తున్నట్టు మత్స్యశాఖ జిల్లా అధికారి టి.ప్రసాద్ తెలిపారు. మండలంలో గల పెంటకోట గ్రామ సమీపాన గల శిల్పా హేచరీలో సోమవారం ఘనంగా చేప రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైన్నైలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఇక్కడ హేచరీస్ యాజమాన్యంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 210 ఫిష్ షాపుల ఏర్పాటులో భాగంగా ఇప్పటి వరకూ 65 షాపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి షాపునకు 10 శాతం లబ్ధిదారు చెల్లిస్తే 40 శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2 వేల రొయ్యల చెరువులు వుండగా వీటిలో 700 రొయ్యలు చెరువులు పాయకరావుపేట మండలంలోనే ఉన్నాయన్నారు. అనుమతులు లేని చెరువులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనకు ఎంపికైన శిల్పా హేచరీని రూ.11 కోట్లతో నిర్మించడం జరిగిందని హేచరీ మేనేజింగ్ పార్టనర్స్ బి.శిల్పానాయక్, మంజునాయక్ తెలిపారు. ఇందులో కేంద్రం రూ.కోటి 50 లక్షలు రాయితీ కల్పించిందన్నారు. రాష్ట్రంలో ఐదు హేచరీలు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనకు దరఖాస్తు చేసుకోగా మొదటగా శిల్పాహేచరీ పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేసుకుందన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకిస్తున్న శిల్పా హేచరీస్ ప్రతినిధులు

రాజకీయ అజ్ఞానంతో పవన్ వ్యాఖ్యలు

అనకాపల్లి టౌన్: వలంటీర్ వ్యవస్థను జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విమర్శించడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని ఉత్తరాంధ్ర చర్చా వేదిక ప్రతినిధులు బుద్ధ రాజేష్, పీలా నాని విమర్శించారు. గవరపాలెం తమ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కరోనా మొదటి, రెండో దశలో వలంటీర్లు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా గడపగడపకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని దాని నిర్మూలనకు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. నిజంగా కేంద్ర నిఘా వర్గాలు ఏపీలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పి ఉంటే డీజీపీకి, సీబీఐకు, సెంట్రల్ హోమ్ మినిస్టర్‌కు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను హైకోర్టు సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేయాలని కోరారు. రూ.5 వేల జీతం తీసుకుని పనిచేస్తున్న వలంటీరీ వ్యవస్థను విమర్శిస్తే, రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు.



మాట్లాడుతున్న బుద్ధ రాజేష్, పీలా నాని

'జీవీఎంసీ స్థాయీ సంఘాన్ని' గెలిపించుకుందాం



జాబితాను ప్రకటిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సూచనలతో స్టాండింగ్ కమిటీ ఎన్నికకు పది మంది కార్పొరేటర్లను ప్రతిపాదించామని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. వారిని గెలిపించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై ఉందన్నారు. జీవీఎంసీ మేయర్ చాంబర్లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో ఉన్న కార్పొరేటర్లను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ ఒక్క ఓటు కూడా వృథా కాకుండా నిబంధనల ప్రకారం వేయాలని సూచించారు. కార్పొరేటర్లందరితో ఓటు వేయించాల్సిన బాధ్యత సంబంధిత ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు తీసుకోవాలన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పది మంది కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ప్రస్తుత స్టాండింగ్ కమిటీ సభ్యులు, పార్టీ ప్రతిపాదించిన 10 మంది కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రతిపాదించిన స్టాండింగ్ కమిటీ సభ్యులు వీరే..

అక్కరమాని పద్మ (ఒకటో వార్డు, భీమిలి), గుడ్ల విజయసాయి (23వ వార్డు, విశాఖ తూర్పు), ఉరుకుటి నారాయణరావు (29వ వార్డు, విశాఖ దక్షిణ), కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు, విశాఖ దక్షిణ), కంటిపాము కామేశ్వరి (47వ వార్డు, విశాఖ ఉత్తర), చల్లా రజని (54వ వార్డు, విశాఖ ఉత్తర), బళ్లా లక్ష్మణరావు (62వ వార్డు, విశాఖ పశ్చిమ), భూపతిరాజు సుజాత (73వ వార్డు, గాజువాక), బట్టు సూర్యకుమారి (77వ వార్డు, పెందుర్తి), పీలా లక్ష్మీ సౌజన్య (81వ వార్డు అనకాపల్లి).

నాలుగేళ్ల ప్రాయంలోనే నాట్య మయూరి

భరతనాట్యంతో ఆకట్టుకుంటున్న చిన్నారి తాన్విశ్రీ

ఆ చిన్నారి వయసు నాలుగేళ్లే... కాళ్లకు గజ్జె కట్టడం తెలియని పసిప్రాయం.. అయితేనేం పురివిప్పిన నాట్య మయూరిలా నర్తించి సభికులనే సమ్మోహితులను చేస్తోంది. సంప్రదాయ నృత్య కళల్లో ఒకటైన భరతనాట్యంలో వివిధ భంగిమలను అలవోకగా ప్రదర్శించి మన్ననలను పొందుతోంది చిన్నారి తాన్విశ్రీ.



కె.కోటపాడు: మండలంలోని కింతాడ గ్రామానికి చెందిన బండారు ఈశ్వరరావు, మాధవి దంపతుల కుమార్తె తాన్విశ్రీ భరతనాట్యంలో విశేష ప్రతిభ చూపుతోంది. చిన్నారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరి కుమార్తె చిన్నప్పటి నుంచి డాన్సులో ఆసక్తి చూపేది. దాన్ని గమనించి సంప్రదాయ నృత్య ప్రదర్శనలో భాగమైన భరతనాట్యంలో ప్రత్యేక శిక్షణ కోసం పెందుర్తి దరి సుజాతనగర్‌లోని చేర్పించారు. అక్కడ శిక్షణ పొందుతూనే ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 34వ ఆలిండియా డాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొంది. తనదైన హావభావాలతో భరతనాట్య నృత్యాన్ని ప్రదర్శించి ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ మేరకు నిర్వాహకులు చిన్నారికి జ్ఞాపికతోపాటు ప్రశంసా పత్రం అందించి అభినందించారు. నాలుగేళ్ల ప్రాయంలోనే కష్టమైన భరతనాట్యం అలవోకగా వేస్తున్న తాన్విశ్రీ రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

280 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్ట్, జీపు స్వాధీనం

పెదబయలు : సీతగుంట పంచాయతీ సీతగుంట జంక్షన్‌లో సోమవారం మహీంద్ర జీపులో 280 కిలోల గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. సీతగుంట జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా కొంత దూరంలో పల్సర్ బైక్‌పై వచ్చిన వ్యక్తి గమనించి వెంటనే బైక్ తిప్పి వేగంగా వెళ్లాడని, దీని వెనుక వస్తున్న జీపు డ్రైవర్ జీపును వెనక్కి తిప్పి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వెంటనే జీపు ఆపి తనిఖీ చేయగా తొమ్మిది సంచుల్లో 280 కిలోల గంజాయి బయటపడిందని, గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితులు ఇంజరి పంచాయతీ మల్లెపుట్టు గ్రామానికి చెందిన పాత్రొంగి కొండబాబు, ఒడిశా రాష్ట్రం పాడువ బ్లాక్ పాతులుంగి పంచాయతీ ఒండ్రుగెడ్డ గ్రామానికి చెందిన గంప ఉమాశంకర్‌ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడ్డ నిందితులు, గంజాయి, స్వాధీనం చేసుకున్న జీపుతో ఎస్‌ఐ మనోజ్‌కుమార్

క్లుప్తంగా

కోదండ రామాలయ అభివృద్ధికి శ్రీకారం



కశింకోటలో ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో బుల్లిబాబు

కశింకోట: కశింకోటలో జాతీయ రహదారి పక్కనున్న దేవదాయ శాఖకు చెందిన కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. గుడి చుట్టూ ప్రహరీ నిర్మాణం, కల్యాణమండప పునరుద్ధరణ పనులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, దేవదాయశాఖల సహకారంతో చేపడుతున్నట్లు పనులకు శంకుస్థాపన చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై, స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మధ్యాహ్నం దాతల సహాయంతో అన్న సమారాధన చేశారు.

దిబ్బవీధిలో జగనన్న సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు గవరపాలెం దిబ్బవీధి సచివాలయం–15లో నిర్వహించనున్నట్లు జీవీఎంసీ అనకాపల్లి జోన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, జెడ్సీ ఎస్.వెంకటరమణ, డీటీ వై.శ్రీరామమూర్తి విచ్చేయనున్నట్టు పేర్కొన్నారు.

నేడు సబ్బవరంలో గడప గడపకు..

సబ్బవరం: సబ్బవరం–1 సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తారు. స్థానిక సమస్యలను తెలుసుకోనున్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 187 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,900	3,950
మూడోరకం	3,100	3,100

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
ఇద్దరు	: సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
రంగబలి	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
ఇన్సిడియస్ ద రెడ్ డోర్	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–4 యూనిట్లు, ఏ నెగిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–32 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–15 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్ 3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ముందస్తు నిర్ధారణతోనే కుష్టు నియంత్రణ

- కుష్టు వ్యాధి బాధితుల కోసం ఇంటింటి సర్వే
- ఇప్పటి వరకు 134 అనుమానిత కేసుల గుర్తింపు
- తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీల పరిధిలో 63 బృందాలు

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు లెప్రసీ కేస్ డిటెక్షన్(ఎల్‌సీడీ) క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టాయి. గత నెల 26న ప్రారంభమైన సర్వే అనకాపల్లి మండలంలో ముమ్మరంగా సాగుతోంది. ఆశా వర్కర్, వలంటీర్‌తో ఏర్పాటు చేసిన బృందాలు ఈ నెల 16 వరకూ ఇంటింటి సర్వే ద్వారా అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి, వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నాయి.

అనకాపల్లి రూరల్: కుష్టువ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తూ ఆందోళన పెంచుతోంది. దీంతో వ్యాధి నిర్ధారణకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలు, అర్బన్ సెంటర్లలో సర్వే మొదలయింది. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో 11,567, తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో 8,266 ఇళ్లల్లో బృందాలు జల్లెడ పడుతున్నాయి. మండలంలో ఈ రెండు పీహెచ్‌సీల పరిధిలో ఉన్న మొత్తం 71,241 మందిని ప్రత్యక్షంగా పరిశీలించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు గ్రామాల్లో సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి ఎల్‌సీడీ సర్వే చేపడుతున్నారు. ప్రతి బృందంలో ఆశా కార్యకర్త, ఒక మగ వలంటీర్ స్త్రీ, పురుషులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనుమానమైన మచ్చలు ఎవరి శరీరంపై ఉన్నా నమోదు చేసుకుని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. మహిళలను ఆశా కార్యకర్తలే పరిశీలించేలా ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంది.

పక్కాగా సర్వే

ఎల్‌సీడీ క్యాంపెయిన్ సర్వేను లెప్రసీ, ఎయిడ్స్, టీబీ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజూ ఎన్ని ఇళ్లలో సర్వే పూర్తయిందీ పక్కాగా క్షేత్ర స్థాయి బృందాల నుంచి హెల్త్ సూపర్‌వైజర్ల ద్వారా తెలుసుకుంటున్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో 11,567 ఇళ్లలో 43,359 మందికి గాను 7,714 ఇళ్లలో 27,536 మందికి సర్వే పూర్తయింది. తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో 8,266 ఇళ్లలో 27,882 మంది ఉండగా 5,260 ఇళ్లలోని 18,243 మందిని సర్వే చేశారు. ఈ సర్వేలో మొత్తం 134 అనుమానిత కేసులను గుర్తించారు.

వైద్య పరీక్షల తర్వాత అవి కుష్టు కేసులో కావో నిర్ధారిస్తారు. ఈ రెండు పీహెచ్‌సీల పరిధిలో గతంలో చేపట్టిన సర్వేలో ఇప్పటికే గుర్తించిన 13 మంది వ్యాధిగ్రస్తులకు నిత్యం మందులు ఇస్తూ చికిత్స అందిస్తున్నారు.



ఇంటింటి సర్వేలో మచ్చలు పరీక్షిస్తున్న బృందం



తుమ్మపాలలో లెప్రసీ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధి వ్యాప్తి–లక్షణాలు

మైక్రో బాక్టీరియం లెప్రీ అనే సూక్ష్మ జీవి వలన కుష్టు వ్యాధి సోకుతుంది. వ్యాధి చర్మానికి, నరాలకు వ్యాపిస్తుంది. వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి కూడా వ్యాధి సోకే అవకాశం ఉంది. శరీరంపై చిన్నవి లేదా పెద్ద మచ్చలు పాలిపోయి ఉంటాయి. ఆ మచ్చలపై స్పర్శ ఉండదు. నొప్పి తెలియదు. చెమట పట్టదు. వెంట్రుకలు కూడా రాలిపోతాయి. చర్మం, చెవి తమ్మెలు, ముఖం, కాళ్లు, చేతులపై బుడిపెలు ఏర్పడతాయి. కాళ్లు, చేతులు, పాదాలు నిస్సత్తువగా మారతాయి. పాదాల్లో పుండ్లు ఏర్పడతాయి. కనురెప్ప పూర్తిగా మూయలేరు.

ఇదీ చికిత్స విధానం

- ఒకటి నుంచి ఐదు మచ్చలుంటే వారిని పాసీ బ్యాసిల్లరీ(పీబీ)గా గుర్తిస్తారు. వారికి ఆరు నెలల చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సును పూర్తిగా వాడాలి.
- ఐదు కంటే ఎక్కువ మచ్చలున్న వారిని మల్టీ బ్యాసిల్లరీ(ఎంబీ)గా పరిగణిస్తారు. వారికి 12 నెలల చికిత్స ఉంటుంది. కనీసం 15 నెలల్లో కోర్సు మందులు పూర్తిగా వినియోగించాలి.
- బహుళ ఔషధ చికిత్సతో ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.
- కుష్టు వ్యాధి నివారణ మందులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తారు.

ప్రారంభ దశలో గుర్తించడమే లక్ష్యం



కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడమే లక్ష్యంగా సర్వేను ముమ్మరం చేశాం. మొదట్లోనే సమస్యను గుర్తించి వైద్యమందిస్తే నివారించవచ్చు. కుష్టు వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా ఇంటింటి సర్వే కోసం వచ్చిన ఆశా, వలంటీర్ బృందానికి తెలియజేయాలి. వారు ప్రభుత్వాస్పత్రిలో పరీక్ష చేయించి అవసరమైన మందులను ఉచితంగా అందేలా చేస్తారు. 6 నుంచి 12 నెలలు మందులు తీసుకుంటే నయమవుతుంది.

– డాక్టర్ జి.పావని, వైద్యాధికారి, తగరంపూడి పీహెచ్‌సీ

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



దరఖాస్తుదారునికి ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



ఏఎస్ పేటలో ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు



చింతలపాలెంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

అనకాపల్లిటౌన్: రాజన్నపాలన కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందిరిపై ఉందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని శంకరం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల గృహాలను మంజూరు చేసి, గృహాలు నిర్మించుకోలేని లబ్ధిదారులకు ప్రభుత్వమే నేరుగా ఇళ్లు కట్టించి ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ పాలనలో సర్టిఫికెట్లు కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి రావడంతోపాటు, ముడుపులు ముట్టజెప్పాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న సురక్ష పథకం ద్వారా ఉచితంగా 11 రకాలైన సర్టిఫికెట్లు అందించడం పట్ల దరఖాస్తుదారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తమకు కావాల్సిన ధ్రువపత్రాల కోసం వలంటీర్ల వద్ద యాప్‌లో నమోదు చేసుకున్న నాలుగు రోజుల్లో వలంటీర్లే మీ ఇంటికి వచ్చి సర్టిఫికెట్లు అందిస్తారని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాలైన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 301 మందికి ఆయా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మీ రామకృష్ణ, ఎంపీడీవో కె.వి.నరసింహరావు, బట్లపూడి సర్పంచ్ గొంతిన సజావతి సత్యారావు, వైస్ సర్పంచ్ గుడాల తాతబాబు, ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

426 మందికి ధ్రువపత్రాల పంపిణీ

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం వినూత్నమైందని, దీనివల్ల గ్రామాల్లో ప్రజా సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని చింతలపాలెం, ఏఎస్ పేట సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించగా విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా చింతలపాలెంలో 426 మందికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బియ్యం కార్డులు వగైరా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇలా గతంలో ఎన్నడూ జరగలేదని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎస్ పేట కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో దీర్ఘకాలిక సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కొట్టి రాము, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, ఏవో ఎ.ఎ.ఖాన్, పంచాయతీ కార్యదర్శి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

అనకాపల్లిటౌన్: తెలంగాణా ప్రభుత్వ తరహాలో ప్రతీ రైతుకు రాష్ట్రంలో ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపిల్లి అప్పలరాజు కోరారు. ఈ మేరకు స్థానిక కోడుగంటి గోవిందరావు భవనం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ సోమవారం సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సాగు వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలన్నారు. 50 ఏళ్లు దాటిన రైతులకు, కౌలు రైతులకు ప్రతి నెలా రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. ఉచిత విద్యుత్‌ను కొనసాగించి, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సూచించారు. భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు వేచలపు వెంకటరమణ, కోరిబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ, ఎస్.దుర్గారావు, నాగేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

కశింకోట: మండలంలోని జాతీయ రహదారిపై బయ్యవరం రైల్వే వంతెన వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ సహా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. వరి గడ్డి దింపి పరవాడ మండలం తానాం నుంచి మండలంలోని సొంత గ్రామం అడ్డాంకు వెళుతున్న ట్రాక్టర్‌ను మార్గమధ్యంలో బయ్యవరం వంతెన వద్ద వెనుకగా వచ్చిన లారీ వేగంగా ఢీకొంది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న అడ్డాం గ్రామానికి చెందిన రెడ్డి రమేష్‌తోపాటు, అతనికి సాయంగా వెళ్లిన అదే గ్రామస్తుడు వర్రి పోతురాజు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ తెలిపారు. రమేష్ తండ్రి రెడ్డి కన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వలంటీర్లు



పట్టణ సీఐ దాడి మోహన్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు



కశింకోటలో గ్రామ వలంటీర్ల నిరసన



కశింకోట ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

అనకాపల్లిటౌన్: ఏలూరు బహిరంగసభలో ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని గ్రామ, వార్డు వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనుక్కి తీసుకోవాలని పట్టణ, మండల వలంటీర్లు కిరణ్, సురేష్, రాణి, స్వాతి, జ్యోతి, ఉషాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నెహ్రూచౌక్‌లో పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా సోమవారం మానహారం నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలపై వలంటీర్లు వలవేస్తున్నారంటూ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం, రాష్ట్రంలో తప్పిపోయిన మహిళల వెనుక వలంటీర్ల పాత్ర ఉందని, ఒంటరి మహిళలను ట్రాప్ చేసి మాయం చేయడం వలంటీర్ల పని అన్నట్టుగా ఆయన వ్యాఖ్యలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్టు పేర్కొన్నారు. నోటికి వచ్చినట్టుగా మాట్లాడటం పవన్‌కు తగదన్నారు. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ మానవహారం నిర్వహించారు. అనంతరం పవన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ సీఐ దాడి మోహనరావుకు వినతిపత్రం అందించారు.

అనుచిత వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలి

కశింకోట: గ్రామ వలంటీర్లను కించపరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉప సంహరించుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కశింకోటలో వలంటీర్లు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం అంకిత భావంతో పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిబంధనలకు అనుగుణంగా సకాలంలో లబ్ధిదారులకు అందించడంలో సాయపడుతున్నామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్న తమను కించపరచడం ఆయనకు సరికాదన్నారు. అనంతరం వలంటీర్లంతా స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డిని కలిసి, పవన్‌పై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



సబ్బవరం రెవెన్యూ పరిధిలో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.286 రెల్లి కాలనీ వద్ద చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ బి.సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య అధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ రెల్లి కాలనీ వద్ద గతంలో కొంతమంది రెల్లి కులస్తులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్టు తెలిపారు. సదరు ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించి పట్టాదారులైన లబ్ధిదారులకు ఆ స్థలాలను అప్పగించామన్నారు. తొలగింపు పనుల్లో వీఆర్వో నూకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ సభ్యులకు సత్కారం



అతిథులను సన్మానించిన హైమా నేత్రాలయం డాక్టర్ ప్రసాద్

పాయకరావుపేట : హైమా నేత్రాలయంలో సోమవారం డాక్టర్ పసగడుగుల శివ రాజా ప్రసాద్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్‌లో వివిధ పదవులకు ఎన్నికైన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు పెదిరెడ్డి చిట్టిబాబు, తుని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఏలూరి బాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాకినాడ నగరం రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ కార్యదర్శిగా అవార్డు వచ్చినందుకు వద్దాది ఆదిత్య, తుని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా పదవీ స్వీకారం చేసిన వర్మ, తుని రోటరీ క్లబ్ కార్యదర్శిగా పదవీ స్వీకారం చేసిన కిశోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్‌గా సేవలందించిన డాక్టర్ మురళీ కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ధాన్యం సాయి, అడపా ప్రకాష్ మాస్టర్, వంక శ్రీను, జాన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల వేగవంతానికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న పీడీ రమామణి

నక్కపల్లి : మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన హౌసింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని పీడీ రామామణి నిర్వహించారు. గ్రామాలవారీగా జగనన్న కాలనీ గృహాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు హౌసింగ్ అసిస్టెంట్లు మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలని ఆదేశించారు. బిల్లులు మంజూరు, సామాగ్రి పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఈ పీవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఈడీ విజేయుడు, ఏఈ డీపీ రాజు పాల్గొన్నారు.

నెలాఖరుకు 15 వేల గృహ నిర్మాణాలు పూర్తి

జూలై నెలాఖరు నాటికి అనకాపల్లిజిల్లాలో 15వేల వరకూ జగనన్న గృహ నిర్మాణాలు పూర్తవుతాయని, ఇప్పటికే 13,453 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ కొయ్య రమామణి చెప్పారు. సోమవారం ఉదయం నక్కపల్లిలో తనను కలిసి విలేకర్లతో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 58,084 గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 11,452 గృహాలకు పునాదులు పూర్తయ్యాయని, 23,723 గృహాలు బేస్మెంట్, 2,927 గృహాలు శ్లాబ్ స్థాయిలో ఉన్నాయని, 1657 గృహాల శ్లాబ్‌లు పూర్తయ్యాయన్నారు.

ఎర్రవరంలో ఉపాధి పనుల ప్రారంభం



పనులు ప్రారంభించినందుకు అభివాదం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరంలో నిలిపివేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్ని సోమవారం ప్రారంభించారు. దీంతో కూలీలు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలోని పనులకు సంబంధించి కూలీల మస్టర్లలో బినామీ బాగోతంపై వచ్చిన ఫిర్యాదు మేరకు సచివాలయ అధికారులు నివేదిక తయారు చేసి ఎంపీడీవోకు అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పనుల్ని తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ఉపాధి హామీ కూలీలు ఆందోళన చేశారు. తమ జీవనోపాధి ఎలా అని ప్రశ్నించారు. వీరి ఆందోళన, అభ్యర్థనల నేపథ్యంలో తిరిగి ఉపాధి పనుల్ని ప్రారంభించడంతో కూలీలు హర్షం తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, పరికరాలు అందజేయాలని కోరారు.

'పంటలకు మద్దతు ధర ప్రకటించాలి'

అచ్యుతాపురం (అనకాపల్లి) : పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, చక్కెర కర్మాగాలను ఆధునికీకరించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట సచివాలయాల్లో కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారం తక్షణమే అందజేయాలని కోరారు.

భగవద్గీత సారాంశం తెలుసుకోండి



భగవద్గీత పుస్తకాన్ని అందిస్తున్న ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

ఎస్.రాయవరం : భగవద్గీత పఠనంతో జన్మ సార్థకమవుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు శాంతరాజు అన్నారు. కర్రివానిపాలెం గ్రామంలో సోమవారం భగవద్గీత ప్రాముఖ్యం గురించి ప్రచారం చేశారు. హిందూ సంప్రదాయ భక్తులు విధిగా గీత సారాంశం తెలుసుకోవాలన్నారు.

'జగనన్న సురక్ష'పై సమీక్ష



ఉద్యోగులతో సమీక్షిస్తున్న తహసీల్దారు కనకారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దారు పి.కనకారావు కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. వెన్నలపాలెంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. 11 ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా వలంటీర్లు, గృహ సారథులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.